08-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఏదైనా తప్పు జరిగితే దానిని తండ్రి నుండి దాచిపెట్టకండి, ఒకవేళ దాచిపెట్టినట్లయితే అలా దాచిపెడుతూ, దాచిపెడుతూ స్వయం కూడా దాగిపోతారు"

ప్రశ్న:- పాడైనదానిని తీర్చిదిద్దే తండ్రి పిల్లలైన మీ విషయంలో పాడైనదానిని ఏ ఆధారముగా తీర్చిదిద్దుతారు?

జవాబు:- పవిత్రత ఆధారముపై. ఎప్పుడైతే తండ్రి పాడైనదానిని తీర్చిదిద్దేందుకు వస్తారో, అప్పుడు ఈ పవిత్రత విషయంలోనే అనేక గొడవలు జరుగుతాయని పిల్లలైన మీకు తెలుసు. అబలలు ఎన్నో అత్యాచారాలను సహించవలసి వస్తుంది. పవిత్రముగా అవ్వకుండా దేవతలుగా అవ్వలేరు. భారత్ ను గవ్వ నుండి వజ్రముగా, దుఃఖధామము నుండి సుఖధామముగా, పాతబడిపోయినదానిని కొత్తగా తయారుచేసేందుకు తప్పకుండా పవిత్రముగా అవ్వవలసి ఉంటుంది. పిల్లలైన మీరు ఈ విషయంలోనే తండ్రికి సహాయం చేస్తారు, అందుకే తండ్రితోపాటు మీ పూజ కూడా జరుగుతుంది.

పాట:- భోళానాథునికన్నా అతీతమైనవారు... (భోలేనాథ్ సే నిరాలా...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారా? ఏ పిల్లలు? ప్రజాపిత బ్రహ్మాకుమారులు మరియు కుమారీలు. తండ్రి అంటారు - నేను బి.కే.ల ముందే జ్ఞానాన్ని వినిపిస్తాను. ఇక్కడ శూద్ర కుమారులు లేక రావణ కుమారులు ఎవరూ కూర్చోలేరు అని పిల్లలకు తెలుసు. పేరే బ్రహ్మాకుమారులు మరియు కుమారీలు అని పెట్టడం జరిగింది అనగా ప్రజాపిత బ్రహ్మా యొక్క సంతానము. మీకు తెలుసు, మన బ్రహ్మాబాబాకు బాబా శివుడు. ఆత్మలమైన మనకు కూడా బాబా శివుడు. ఆ తండ్రే పాడైనదానిని తీర్చిదిద్దేవారు. భారత్ యొక్క భాగ్యమే పాడయ్యింది, దానినే తీర్చిదిద్దుతారు. తండ్రి అంటారు - భారత్ వజ్రతుల్యముగా ఉండేది, సుఖధామముగా ఉండేది. కొత్త ప్రపంచంలో కొత్త భారత్, కొత్త దేవీ-దేవతల రాజ్యము ఉండేది. ఇప్పుడు భారత్ యొక్క భాగ్యమే పాడైపోయింది, అసురుల రాజ్యము ఉంది. పాడైనదానిని బాగుచేసేవారు లేక తీర్చిదిద్దేవారు ఎవరు? ఇది బ్రాహ్మణులైన మీరు తప్ప ఇంకెవరూ తెలుసుకోలేరు. తప్పకుండా భారత్ ఎంతో ఉన్నతంగా ఉండేది, ఇప్పుడు నీచంగా ఉంది. ఇంకే ధర్మము గురించి - అది చాలా ఉన్నతంగా ఉండేది, ఇప్పుడు నీచంగా ఉంది అని అనరు. ఎవరైతే రాజ్యాన్ని పోగొట్టుకున్నారో వారే మళ్ళీ రాజ్యం చేస్తారు. కావుననే పాడైన భాగ్యాన్ని తీర్చిదిద్దేవారు అని అంటారు. సత్యయుగం తర్వాత మళ్ళీ తప్పకుండా త్రేతా, ద్వాపర, కలియుగాలు రావాల్సిందే. అందరి భాగ్యము పాడవ్వాలసిందే. సతో, రజో, తమోలలోకి తప్పకుండా రావాలి. ఇప్పుడు అందరి భాగ్యము పాడై ఉంది. అన్ని ధర్మాలకు పరస్పరంలో ఎంతో గొడవ ఉంది. చైనీయులు పరస్పరంలో, బౌద్ధులు పరస్పరంలో, అందరూ పరస్పరంలో ఎంతగా పోట్లాడుకుంటూ-గొడవపడుతూ ఉంటారు. ఇన్ని అనేక ధర్మాలు ఏవైతే ఉన్నాయో అందరి భాగ్యము పాడైపోయి ఉంది. అందరూ తమోప్రధాన శిథిలావస్థలో ఉన్నారు. అందరూ సతోప్రధానం నుండి తమోప్రధానంగా అవ్వవలసిందే. రావణుడు తమోప్రధానంగా చేస్తాడు, మళ్ళీ రాముడు వచ్చి రావణుడు పాడుచేసినదానిని తీర్చిదిద్దుతారు.

రాముడు అని ఎవరిని అంటారో మీకు తెలుసు. రామ-రామ అంటూ మాలను తిప్పుతారు, అప్పుడు పరమాత్మనే తలచుకుంటారు. దాని పేరే రుద్రమాల. అది రుద్రుడైన శివుని మెడలోని మాల. అన్ని ధర్మాలవారు తప్పకుండా తలచుకుంటారు. అన్ని ధర్మాలవారికి సద్గతిదాత శివుడు. వారితోపాటు తప్పకుండా సహాయకులు ఉంటారు. రుద్రమాల ఎంతో సేవ చేస్తుంది. పిల్లలైన మీరు చాలా సేవ చేయాలి. సేవ చేస్తారు కావుననే మీకు పూజ జరుగుతుంది. రుద్ర యజ్ఞాన్ని కూడా రచిస్తారు, కేవలం భారత్ లోనే కాదు కానీ మొత్తం ప్రపంచంలో రచిస్తారు ఎందుకంటే మీరు మొత్తం ప్రపంచాన్ని పావనంగా చేస్తారు. సర్వశక్తివంతుడైన తండ్రి నుండి శక్తిని తీసుకొని మీరు స్వర్గాన్ని తయారుచేస్తారు కావున తప్పకుండా మొత్తం సృష్టి అంతా మిమ్మల్ని పూజించాలి. రుద్రుడు అంటే తండ్రి. వారిది పెద్ద శివలింగం మట్టితో తయారుచేస్తారు మరియు చిన్న-చిన్న సాలిగ్రామాలను కూడా తయారుచేస్తారు. దీని పేరు రుద్ర యజ్ఞము. మీ పూజ జరుగుతుంది ఎందుకంటే మీరు సేవ చేసి వెళ్ళారు. రుద్ర యజ్ఞాన్ని రచిస్తారు, ఎంతో పూజిస్తారు. లక్షల కొలది సాలిగ్రామాలను తయారుచేస్తారు. మొదట 8 రత్నాల మాల ఉంటుంది, ఆ తర్వాత 108 మాల మరియు 16108 మాల ఉంటుంది. వారు సహాయం చేసారు, ఎవరైతే ఎక్కువ సహాయం చేస్తారో వారే సమీపంగా ఉంటారు.

ఇప్పుడు మీరు రుద్రమాలలో సమీపంగా కూర్చబడేందుకు పురుషార్థం చేస్తారు. కేవలం తండ్రిని స్మృతి చేయాలి. ఇది చాలా సహజము. పిల్లలకు తండ్రిని స్మృతి చేయడం చాలా సహజము, జన్మ తీసుకోవడంతోనే నాన్నా-అమ్మా అని అనడం నేర్చుకుంటారు. అలాగే మీరు కూడా బాబా-మమ్మాకు పిల్లలుగా అయ్యారు. నీవే తల్లివి, తండ్రివి... అని అంటారు కూడా. మనం మాతా-పితల సమ్ముఖంలో కూర్చున్నామని ఇప్పుడు మీకు తెలుసు. ఆ మాతా-పితలు మనకు రాజ్యాన్ని ప్రాప్తి చేసుకునేందుకు శిక్షణను ఇస్తారు. ఆ మాటకొస్తే రాజుగా తయారుచేసే శిక్షణను రాజే ఇవ్వాలి. ఏ విధంగా బ్యారిస్టర్ గా తయారుచేసే శిక్షణను బ్యారిస్టర్ ఇస్తారు కానీ ఇక్కడ ఇది అద్భుతమైన విషయము. పరమపిత పరమాత్మయే జ్ఞానసాగరుడు. వారు వరల్డ్ ఆల్మైటీ అథారిటీ (సర్వశక్తివంతుడు). వారికి అన్ని వేదాలు, శాస్త్రాలు, గ్రంథాలు మొదలైనవాటి గురించి తెలుసు. వారు నిరాకారుడు, నాలెడ్జ్ ఫుల్, ఆనందసాగరుడు, దయార్ద్ర హృదయుడు. అందరిపైనా దయ చూపిస్తారు. మొత్తం సృష్టి అంతటిపైనా దయ చూపిస్తారు ఎందుకంటే మొత్తం సృష్టి అంతా తమోప్రధానంగా అయి ఉంది. 5 తత్వాలు కూడా తమోప్రధానంగా ఉన్నాయి. వాటిపై కూడా దయ చూపిస్తారు, అవి కూడా సతోప్రధానంగా అవుతాయి, అందుకే వారిని అనంతమైన సర్వోదయుడు అని అంటారు. ఇది కూడా డ్రామాలో రచించబడి ఉంది. ఆత్మ పవిత్రంగా అవ్వడంతో ప్రతి వస్తువు పవిత్రంగా అవుతుంది. ఇప్పుడు ఈ తత్వాలు మొదలైనవి కూడా ఎంతగా నష్టపరుస్తాయి. అక్కడ తత్వాలు కూడా సతోప్రధానంగా ఉంటాయి. ఎవరూ ఎప్పుడూ వృద్ధులుగా అవ్వరు. కావున పాడైనదానిని తీర్చిదిద్దేవారు తండ్రి. వారినే వరల్డ్ ఆల్మైటీ అథారిటీ (సర్వశక్తివంతుడు) అని అంటారు. వారే సర్వశక్తివంతమైన రాజ్యాన్ని స్థాపన చేస్తారు. వారు స్వయం నిరాకారుడు, వారిని మహారాజు లేక విశ్వాధిపతి, విశ్వంపై రాజ్యం చేసేవారు అని అనరు. వారు చేసేవారు-చేయించేవారు. వారు దేవీ-దేవతల రాజధానిని స్థాపన చేయిస్తారు. వారు స్వయం రాజ్యం చేయరు.

మేము సర్వశక్తివంతమైన విశ్వానికి అధిపతులుగా అవుతాము అని పిల్లలైన మీరు అంటారు. అప్పుడిక మీపై ఇంకెవ్వరి అథారిటీ నడవదు. మిమ్మల్ని ఎవ్వరూ ఆజ్ఞాపించలేరు. సత్య-త్రేతాయుగాలలో ఇంకెవ్వరూ ఉండనే ఉండరు. కావున సర్వ శాస్త్రమయి శిరోమణి గీత అని, భగవంతుడే రాజయోగాన్ని నేర్పించారు అని పిల్లలైన మీరు నిరూపించి చెప్పాలి. మనం మనుష్యుల నుండి దేవతలుగా అవుతామని పిల్లలైన మీకు తెలుసు. మనుష్యుల భాగ్యము పాడైపోయింది, అందుకే తండ్రి వచ్చి దేవతలుగా తయారుచేస్తారు. మొత్తం అంతా పవిత్రతపై ఆధారపడి ఉంది. బాబా, పవిత్రంగా అవ్వడానికి ఎన్నో అత్యాచారాలు చేస్తారు అని పిల్లలు వ్రాస్తారు. చాలా యుక్తిగా నడుచుకోవాలని పిల్లలకు అర్థం చేయించడం జరిగింది. ఇందులో చాలా తెలివి కావాలి. ఒక ఆట ఉంది, అందులో - స్వయాన్ని రక్షించుకునేందుకు స్త్రీ ఎన్ని పాత్రలు పోషించినట్లుగా చూపించారు. తండ్రి అంటారు - పిల్లలూ, ఇందులో నష్టోమోహులుగా అవ్వవలసి ఉంటుంది. చాలా మందికి పతితో, పిల్లలతో మోహపు బంధము ఉంటుంది. కన్యకైతే కేవలం తల్లిదండ్రులపైన మరియు సోదరీ-సోదరులపైన మోహం ఉంటుంది, తర్వాత ఎప్పుడైతే వివాహం చేసుకుంటారో, అప్పుడు ఇంకా ఎక్కువ మందిపైన మోహం ఏర్పడుతుంది. పతి, అత్తగారు, ఆ తర్వాత పిల్లలు జన్మిస్తే వారిపై ఎంత మోహం ఏర్పడుతుంది. అది రెండింతలుగా పెరుగుతుంది, అందుకే మొదట నష్టోమోహులుగా అవ్వాలి, ఆ తర్వాత పరీక్షలు కూడా వస్తాయి. ఏ విధంగా రాజులు ఇళ్ళు-వాకిళ్ళను వదిలినప్పుడు మొదట గురువు వద్దకు వెళ్తారు, అప్పుడు దేహాభిమానం తొలగిపోవాలి అని వారు వీరి చేత కట్టెలు కొట్టిస్తారు, ఆశ్రమాన్ని శుభ్రం చేయించడం మొదలైనవి చేయిస్తారు. ఇక్కడ కూడా ఇటువంటి నియమాలు ఉన్నాయి. పేదవారైతే ఈ పనులన్నీ చేస్తూ ఉంటారు. గొప్ప ఇంటివారిలో చాలా దేహాభిమానము ఉంటుంది కావున వారి పరీక్ష తీసుకోవడం జరుగుతుంది. ప్రారంభంలో బాబా కూడా పరీక్ష తీసుకున్నారు కదా. దేహాభిమానాన్ని తొలగించడానికి మీరు అన్నీ చేసేవారు. కారు శుభ్రం చేయడం, చాకలి పని చేయడం. ఎవరైనా వస్తే - మొదట ఈ పనులు చేయవలసి ఉంటుందని చెప్పండి. గొప్ప ఇంటివారు రావడమే చాలా కష్టము. పేదవారు దెబ్బలు తినే అవకాశం ఉంటుంది. పవిత్రంగా ఉండనివ్వరు. వారితో ఇక యుక్తిగా నడుచుకోవలసి ఉంటుంది కానీ పూర్తి నష్టోమోహులుగా తప్పకుండా ఉండాలి. సగం-సగం నష్టోమోహులుగా లేకపోతే ఒక కాలు అటువైపు, ఇంకొక కాలు ఇటువైపు, వేలాడుతూ ఉంటారు. ఆ తర్వాత ఎంతోమంది వేలాడుతూ దుఃఖితులుగా అవుతారు. తండ్రిని మర్చిపోవడంతో ఛీ-ఛీగా అయిపోతారు.

తండ్రి పిల్లలకు నిరంతరము స్మృతి చేసేందుకు ఎన్ని యుక్తులను తెలియజేస్తారు. స్మృతితోనే వికర్మాజీతులుగా అవుతారు. కల్ప-కల్పము శ్రీమతాన్ని ఇస్తూ వచ్చారు. రాజధాని అయితే తప్పకుండా స్థాపనవుతుంది. ఎవరైతే కల్పక్రితం వలె పురుషార్థం చేస్తారో వారు దాగి ఉండడం జరుగదు. వెంటనే తెలిసిపోతుంది. దాస-దాసీలు కూడా తయారవ్వాలి కదా. ఇక్కడ ఉన్నారంటే రాజధానిలోకైతే వచ్చేస్తారు ఎందుకంటే ఎంతైనా పిల్లలుగా అయితే అయ్యారు

కదా. దాస-దాసీలుగా అయి ఇక ఏదో ఒక పదవిని పొందుతారు. లేదంటే దాస-దాసీలు ఎక్కడి నుండి వస్తారు. ప్రజలైతే లోపలికి రావడానికి అనుమతి ఉండదు. దాస-దాసీలు లోపల ఉంటారు. మేము శ్రీకృష్ణునికి దాస-దాసీలుగా అయినా మంచిదే అని చాలా మంది అంటారు. తల్లి కన్నా ఎక్కువగా వారి ఒడిలోకి వస్తాడు. ఈ రోజుల్లో పిల్లలను నర్సులే సంభాళిస్తారు. అక్కడ శ్రీకృష్ణుడిని సంభాళించడంలో చాలా సంతోషం కలుగుతుంది. శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు మాతలందరూ శ్రీకృష్ణుడిని ఊయలలో ఊపుతారు. అక్కడ కూడా దాసీలు సంభాళిస్తారు.

బాప్ దాదాకు చాలా మంచి పిల్లలు కావాలి. తండ్రి అంటారు, రాజధానిని స్థాపన చేయడానికి ఎంత కష్టపడవలసి ఉంటుంది. రకరకాల వృక్షాల యొక్క కట్టెలు ఉన్నాయి (రకరకాలవారు ఉంటారు), సంభాళించేవారికి విసుగు వచ్చేస్తుంది. కొందరిపై నడుస్తూ-నడుస్తూ గ్రహచారం కూర్చొంటుంది. ఇక అడగకండి. దాని గురించి బెల్లానికి తెలుసు, బెల్లం సంచికి తెలుసు అనగా బాప్ దాదాకు తెలుసు. బెల్లము అంటేనే తండ్రి, వారు మధురమైనవారు కదా. వారి సంచికి, ఎవరిలోకైతే వారు వస్తారో వారికి తెలుసు మరియు వీరికి తెలుసు. మాయా రావణుడు ఎటువంటి చెంపదెబ్బను వేస్తాడంటే తెలియనే తెలియదు. ఏదైనా ఆజ్ఞ ఉల్లంఘన జరిగితే క్షమాపణ అయినా తీసుకోండి, లేకపోతే కర్మభోగము చాలా ఎక్కువైపోతుంది. అర్థం చేయించినా అర్థం చేసుకోరు. ఆ విధంగా మాయా గ్రహణము పడుతుంది. బాబా స్వయంగా చెప్తారు. అప్పుడప్పుడు యోగం చాలా బాగా అనిపిస్తుంది, అప్పుడప్పుడు మాయ ఎంతగా తుఫానులలోకి తీసుకొస్తుందంటే, ఇక అడగకండి. బాబా అంటారు - మొదట మీరు అనుభవం చేస్తారు, అప్పుడే కదా ఇతరులకు చెప్పగలుగుతారు. కావున తుఫానులన్నీ మొదట బాబా ఎదురుగా వస్తాయి. బాబా అంటారు - మిమ్మల్ని మీరు అన్నీ తెలిసినవారిగా భావించకండి. హృదయం స్వచ్ఛంగా ఉన్నట్లయితే ఉన్నత పదవి లభిస్తుంది. లోపల-బయట హృదయం స్వచ్ఛంగా ఉండాలి, అప్పుడే సత్యమైన హృదయంపై స్వామి రాజీ అవ్వగలరు. మన పాడైన భాగ్యాన్ని బాబా తీర్చిదిద్దుతున్నారు అని పిల్లలైన మీకు తెలుసు. మనం పూర్తిగా కోతుల వలె ఉండేవారము. బాబా మందిర యోగ్యులుగా తయారుచేస్తారు. మనం విశ్వానికి అధిపతులుగా అవుతాము, ఆ తర్వాత మందిరంలో కూర్చునేందుకు ఒక చిన్న గది లభిస్తుంది. సత్యయుగాన్ని శివాలయము అని అంటారు. మొత్తం విశ్వానికి అధిపతులుగా అయి రాజ్యం చేస్తారు, ఆ తర్వాత మన కొరకు మందిరాలు తయారవుతాయి, అందులో మనం పూజించబడతాము. పూజ చేసేది కూడా మొదట మనమే. మనమే పూజ్యులుగా ఉండేవారము, మళ్ళీ మనమే పూజారులుగా అయ్యాము, మళ్ళీ పూజ్యులుగా అవుతాము. చాలా బాగా అర్థం చేయించడం జరుగుతుంది. మాయ మంచి-మంచి పిల్లల బుద్ధిని కూడా పాడు చేస్తుంది. దేహాభిమానము చాలా నష్టపరుస్తుంది, అప్పుడిక ఏదో ఒక పాపము జరుగుతుంది. శివబాబా ఆజ్ఞను ఎప్పుడూ ఎవరూ ఉల్లంఘించకూడదు, వారి నుండి ఏదీ దాచి పెట్టకూడదు. వారు ధర్మరాజు కూడా, చాలా దండన వేస్తారు. వారంటే భయం ఉండాలి. ఆజ్ఞ ఉల్లంఘన జరిగితే క్షమాపణ అడగాలి, బ్రహ్మాబాబా ద్వారా శివబాబాతో - బాబా, ఈ రోజు మా ద్వారా ఈ పొరపాటు జరిగింది. మొదట బ్రహ్మా చదువుతారు కదా అన్న భయం ఉంటుంది. అరే, వారు బాబా, వారు శిక్షణను ఇస్తారు. మమ్మా కూడా శిక్షణను ఇస్తారు. మీకు కూడా ఎవరైనా చెప్తే అప్పుడు మీరు శివబాబాకు సమాచారాన్ని ఇస్తారు. మమ్మా, బాబాలకు కూడా తెలిసిపోతుంది. ఎంతో అర్థం చేయించడం జరుగుతుంది. మదపుటేనుగులా అవ్వకూడదు. దానికి ఎంతో అభిమానము ఉంటుంది. ఈ దేహాభిమానం ఎంతో నష్టదాయకము, అది అర్ధకల్పం ఉంటుంది కదా. అక్కడ - నేను ఒక ఆత్మను, ఈ పాత శరీరాన్ని వదిలి కొత్తది తీసుకుంటాను అని భావిస్తారు. అక్కడ ఆత్మాభిమానులు అని అంటారు. ఇక్కడ అందరూ దేహాభిమానులుగా ఉన్నారు. కావున పిల్లలు శ్రీమతాన్ని తీసుకుంటూ ఉండాలి. తప్పును ఎప్పుడూ దాచిపెట్టకూడదు. అలా దాచిపెడుతూ-దాచిపెడుతూ దాగిపోతారు. యోగము తెగిపోతుంది. పాడైనదానిని తీర్చిదిద్దేవారు అథారిటీ అయిన భగవంతుడు ఒక్కరే. ఇప్పుడు మీరు వారి పిల్లలుగా అయ్యారు. అచ్ఛా!

అతి మధురాతి-మధురమైన సికీలధే జ్ఞాన సితారలకు మాత-పిత బాప్ దాదాల నంబరువారు పురుషార్థం అనుసారముగా ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లోపల, బయట హృదయపూర్వకమైన స్వచ్ఛతతో స్వామి అయిన తండ్రిని సంతుష్టంగా ఉంచాలి. మాయ గ్రహణం నుండి రక్షించుకునేందుకు తండ్రికి సత్యతతో అన్ని విషయాలను వినిపించాలి.

2. పూర్తి నష్టోమోహులుగా అవ్వాలి. కొద్దిగా కూడా ఏ దేహధారులపైనా మోహము ఉంచుకోకూడదు. దేహాభిమానాన్ని

తెంచేందుకు పూర్తి-పూర్తి పురుషార్థం చేయాలి.

వరదానము:- స్నేహమనే ఇంద్రజాలము ద్వారా నిర్బంధనులను కూడా బంధనములో బంధించే శ్రేష్ఠ ఇంద్రజాలికులుగా కండి

తండ్రికంటే కూడా పెద్ద ఇంద్రజాలికులు పిల్లలైన మీరే. మీ వద్ద ఎటువంటి స్నేహమనే ఇంద్రజాలము ఉందంటే, దాని ద్వారా నిర్బంధనులను కూడా బంధనములో బంధించేస్తారు. తండ్రికి కూడా పిల్లలు తప్ప ఇంకేమీ తోచదు. నిరంతరం పిల్లలే గుర్తు వస్తుంటారు. ఎన్ని సార్లు తండ్రిని భోజనానికి పిలుస్తుంటారు, తింటుంటారు, నడుస్తుంటారు. నిద్రిస్తున్నా కూడా తండ్రి తోడుగా ఉంటారు. ఏదైనా కర్మ చేస్తున్నప్పుడు ఇలా అంటారు - ఈ పని మీది, మీరే చేయించండి, నిమిత్తంగా మాత్రమే మేము చేయి వేస్తాము. అలా కర్మ యొక్క భారాన్ని కూడా తండ్రికి ఇచ్చేస్తారు, మరి శ్రేష్ఠ ఇంద్రజాలికులుగా అయ్యారు కదా.

స్లోగన్:- తమ స్వస్థితి యొక్క శక్తి ద్వారా పరిస్థితిని మార్చేవారు ఎప్పుడూ ఆందోళన చెందరు.